క్లుప్తంగా

విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్



గోనెగండ్లలో ఇండస్ట్రియల్ విజిట్‌లో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

గోనెగండ్ల: ఒకేషనల్, టెక్నికల్ కోర్సుల వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్‌ఎం నాగభూషణం పేర్కొన్నారు. గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థులకు గురువారం ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బ్లూడ్రాప్స్ వాటర్ ప్లాంట్, విజయలక్ష్మి కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ వర్క్ కేంద్రాలను సందర్శించారు. ఆ యంత్రాల పనితీరును అక్కడ సిబ్బంది విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని హెచ్‌ఎం సూచించారు. ఉపాధ్యాయులు సలీం బాషా, పుల్లయ్య, నరేష్‌కుమార్, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడమే టీడీపీ నైజం

తుగ్గలి: అభివృద్ధిని అడ్డుకోవడమే టీడీపీ నాయకుల నైజమని సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు మండిపడ్డారు. పీసీకొండలో తాగునీటి ట్యాంకు నిర్మిస్తున్న స్థల వివాదానికి సంబంధించి గురువారం ఆయన తహసీల్దార్ రవిని కలిశారు. ఆయన మాట్లాడుతూ శభాష్‌పురం పంచాయతీ మజరా గ్రామం పైచింతలకొండలో ఇంటింటికీ కొళాయి ఏర్పాటుకు జలజీవన్ మిషన్‌కింద రూ.35 లక్షలు మంజూరయ్యాయన్నారు. గ్రామ సమీపంలోని గుట్టపై ట్యాంకు నిర్మిస్తుంటే టీడీపీ కార్యకర్త శ్రీనివాసులు తన పట్టా పొలంలో నిర్మాణం చేపట్టరాదని అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టుకు వెళ్లాడన్నారు. గత ప్రభుత్వ హయాంలో వంక పోరంబోకు భూమిని అక్రమంగా పట్టా పొందారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు విచారణ చేసి అక్రమంగా పొందిన పట్టాను రద్దు చేయాలని తహసీల్దార్‌ను కోరారు.

84 శాతం కులగణన పూర్తి



చిట్యాలలో కులగణన వివరాలు సేకరిస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

కృష్ణగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే మండలంలో 84 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ రామస్వామి తెలిపారు. గురువారం ఆయన మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో సర్వే తీరును పరిశీలించారు. మండలంలోని 14 గ్రామ సచివాలయ పరిధిలోని 225 క్లస్టర్లలో మొత్తం 15,115 కుటుంబాల్లో 47,914 మందికి గాను ఇప్పటివరకు 12,696 కుటుంబాల్లో సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. కొన్ని గ్రామాల్లో వలస వెళ్లిన వారివి కూడా ఓటీపీ ద్వారా సర్వే చేస్తున్నామన్నారు. ఈ నెల 4 నాటికి సర్వే వంద శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

బాధిత కుటుంబానికి పట్టా అందజేత



లక్ష్మీబాయికి భూ పట్టా అందజేస్తున్న ఆర్డీఓ రామలక్ష్మి

తుగ్గలి: మండల పరిధిలోని రోళ్లపాడుకు చెందిన వెంకటేష్‌నాయక్ మూడేళ్ల క్రితం శభాష్‌పురం సమీపంలోని రంగాపురం వద్ద హత్యకు గురయ్యాడు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ఐదెకరాల భూమి, ఐదు సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేసింది. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పత్తికొండ ఆర్డీఓ ఎస్.రామలక్ష్మి మృతుడి తల్లి లక్ష్మీబాయికి పట్టా అందజేశారు. తహసీల్దార్ రవి, డీటీ నిజాముద్దీన్, ఆర్‌ఐ సుధాకర రెడ్డి, వీఆర్వో రంగప్ప ఉన్నారు.

కిడ్నాప్ కలకలం



అదృశ్యమైన చిన్నారులు అప్పు, ఉజ్జు

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో ఆదూరి సురేంద్ర, లత దంపతుల కూతుర్లు అప్పు, ఉజ్జు అనే ఆరేళ్ల వయసు గల కవల పిల్లలు గురువారం సాయంత్రం 5 గంటల నుంచి కనబడకపోవడంతో కిడ్నాప్‌కు గురయ్యారనే వార్త గ్రామంలో కలకలం రేగింది. పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్తులు చుట్టు ప్రక్కల ప్రాంతాలలో వెతికినా ఫలితం కనిపించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సాయంత్రం గ్రామంలో ఇద్దరు వ్యక్తులు టెంకాయ చెట్లకు ఇంజెక్షన్లు వేస్తామని తిరిగారని అప్పటి నుంచి పిల్లలు, ఆ వ్యక్తులు కనిపించడం లేదని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

5 నుంచి సుంకులమ్మ దేవర

తుగ్గలి: మండల పరిధిలోని అమినాబాద్‌లో సుంకులమ్మ దేవర ఈనెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 5న అమ్మవారికి ప్రత్యేక పూజలు, 6న బోనాల సమర్పణ ఉంటుందని పేర్కొన్నారు.

పల్లెలకు నిధుల వరద

- గ్రామ స్వరాజ్యం దిశగా ప్రభుత్వం అడుగులు
- 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.19 కోట్లు మంజూరు
- గ్రామాల్లో కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు అవకాశం
- గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ఆధారంగా పనులు



ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

ఆలూరు రూరల్: పంచాయతీలకు ఆర్థిక దన్ను కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోని గ్రామాల రూపురేఖలను మార్చేందుకు తాజాగా 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. వీటితో సీసీ రోడ్లు, కాలువలు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి పనులు చేపట్టేందుకు అవకాశం ఏర్పడింది. గ్రామ పంచాయతీల్లో కొత్త పాలన వచ్చి మూడేళ్లయిన సందర్భంగా మండలంలో గ్రామ సర్పంచ్‌ల పాలన ఉన్న పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,19,80,586 జమ చేసింది. వీటిని 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన ఆయా పంచాయతీల ఖాతాల్లో పీఎఫ్‌ఎంఎస్ (పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) ద్వారా జమ చేసింది. ఈ నిధులతో గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలతో పాటు పారిశుద్ధ్య పనులు, వివిధ రకాల చార్జీల చెల్లింపు, చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రాల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు కూడా చెల్లించవచ్చు.

17 పంచాయతీలకు లబ్ధి

మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు తాజాగా 15వ ఆర్థిక సంఘం నిధులు జమయ్యాయి. 2022–23 ఆర్థిక సంఘంలో ఇచ్చిన ముందస్తు ప్రణాళిక ద్వారా మొదటి విడత కింద రూ.1,19,80,586 నిధులు విడుదలయ్యాయి. వచ్చే రెండు నెలల్లో (ఫిబ్రవరి, మార్చి) 2023–24 నిధులు కూడా విడుదల కానున్నాయని అధికారులు వెల్లడించారు. దీంతో పంచాయతీల్లో ఇంతవరకు జరగని స్థాయిలో అభివృద్ధి పనులు ఊపందుకోనున్నాయి. మారుమూల ప్రాంతాలు, అనుబంధ గ్రామాలు కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ నిధులపై రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణ ఉంటుంది. పంచాయతీల్లో వివిధ ఖర్చులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ స్వరాజ్య ఈ-పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

ఖర్చు చేయాల్సిన విధి విధానాలు

పంచాయతీలకు జమైన నిధులు టైడ్, అన్‌టైడ్‌ల కింద విడుదల అవుతాయి. టైడ్ కింద రహదారులు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం, కరెంటు బిల్లు చెల్లింపు, గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్, పంచాయతీ భవనాల అభివృద్ధికి వినియోగించుకోవాలి. అన్‌టైడ్ నిధుల కింద తాగునీటి అవసరాలు, చేతి పంపులు, నీటి ట్యాంకులు, మోటార్ల నిర్వహణ చేసుకోవాలి.

మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేయాలి



ప్రభుత్వం ద్వారా విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేయాలి. ప్రాధాన్యత, మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుంది. అభివృద్ధి పనులకు ఉపయోగించిన నిధుల వివరాలు, బిల్లులను గ్రామ స్వరాజ్య పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ నిధులు గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయి.

– ప్రకాష్‌నాయుడు, ఈఓపీఆర్డీ, ఆలూరు

గ్రామ పంచాయతీల వారీగా మంజూరైన నిధులు

గ్రామం	మంజూరైన నిధులు రూ.
ఆలూరు	29,20,915
అరికెర	8,58,677
అరికెర తండా	1,46,556
హత్తిబెళగల్	9,24,027
హులేబీడు	6,55,226
కమ్మరచేడు	5,97,343
కురుకుంద	4,79,806
కురువళ్లి	2,73,117
మనేకుర్తి	6,57,523
మరకట్టు	3,84,695
మొలగవల్లి	15,91,357
ఎం.కొట్టాల	3,40,155
ముద్దనగేరి	3,52,427
మూసానహళ్లి	3,45,778
పెద్దహోతూరు	11,08,374
తుంబళబీడు	3,44,610
మొత్తం	1,19,80,586

గడ్డివాముల దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న గ్రామస్తులు

హాలహర్వి: మండలంలోని బిలేహాల్ గ్రామంలో రెండు గడ్డివాములు దగ్ధమైన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన చిన్న ఆంజనేయ అనే రైతుకు చెందిన గడ్డివాములకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు మంటలపై నీరు పోసి అదుపు చేశారు. ఆలూరు నుంచి అగ్నిమాపక వాహనం వచ్చి పూర్తి స్థాయిలో మంటలను అదుపు చేసింది. దీంతో పక్కనే ఉన్న గడ్డివాములకు మంటలు విస్తరించకుండా చేయడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు ఆంజనేయ వాపోయాడు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

హొళగుంద: మండల పరిధిలోని ముద్దటమాగి గ్రామంలో పొలం విషయంలో ఘర్షణకు దిగిన ఇరువర్గాల వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు గురువారం విలేకరులకు తెలిపారు. ఘర్షణపై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కృష్ణారెడ్డితో పాటు మరో ఇద్దరు, గణేష్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



బిలేహాల్‌లో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరూపాక్షి

హాలహర్వి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్దామని, కార్యకర్తలు కలిసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరూపాక్షి పిలుపునిచ్చారు. ఆయన గురువారం మండలంలోని విరుపాపురం, కుర్లేహళ్లి, బిలేహాల్, నిట్రవట్టి, అర్ధగేరి గ్రామాల్లో పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి సీఎం జగనన్నతోనే సాధ్యపడిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పేద ప్రజల శ్రేయస్సు కోసం అమలుచేసిన సంక్షేమ పథకాలను వివరించారు. నియోజకవర్గంలో పార్టీ గెలుపునకు శాయశక్తులా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వాల్మీకి మహర్షి, భక్త కనకదాసు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే బిలేహాల్ గ్రామంలో వరిగడ్డి వాములు దగ్ధమై నష్టపోయిన రైతు చిన్న ఆంజనేయకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జూటూరు మారయ్య, పచ్చారపల్లి రామారెడ్డి, తిప్పారెడ్డి, ఎంపీటీసీ గోపాల్, సర్పంచులు మోకా సిద్ధమ్మ, ఉలిగప్ప, గురుదాస్‌రెడ్డి, సద్దాం హుసేన్, గాదిలింగప్ప, తిమ్మప్ప, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

హొళగుంద: హెబ్బటం గ్రామం వెంకటగిరి కాలనీలో మంగళవారం వంటగ్యాస్ సిలిండర్లు పేలి భారీగా ఆస్తి నష్టపోయిన బోయ నల్లనయ్యగారి రాఘవేంద్రను వైఎస్సార్‌సీపీ నాయకులు విరూపాక్షి పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం తరఫున సాయం అందేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

ప్రశాంతంగా జీవించండి



పుట్లూరులో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సురేష్‌కుమార్ రెడ్డి

కృష్ణగిరి: గ్రామాల్లో పంతాలు, పట్టింపులకు పోకుండా అందరూ కలిసిమెలిసి ప్రశాంతంగా జీవించాలని వెల్దుర్తి సీఐ సురేష్‌కుమార్ రెడ్డి గ్రామస్తులకు సూచించారు. మండల పరిధిలోని పుట్లూరు గ్రామంలో రెండు రోజుల క్రితం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన నేపథ్యంలో గురువారం ఆయన ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి గ్రామంలో పర్యటించారు. ఘర్షణకు గల కారణాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని, అలాగాకుండా చట్టం మీ చేతుల్లోకి తీసుకుంటే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. మంగళవారం రాత్రి జరిగిన ఘటనలో గాయపడిన కురువ మహేష్ ఫిర్యాదు మేరకు ఓ వర్గానికి చెందిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనలో మహేష్ ఇళ్లు పాక్షికంగా దెబ్బతినడంతోపాటు, బాధితుని మామ మల్లయ్య బొలెరో వాహనం కూడా దెబ్బతినడంతో దాదాపుగా రూ.2 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్లు గుర్తించామన్నారు. గ్రామంలో మరి కొన్ని రోజులు పికెటింగ్ కొనసాగిస్తామని ఆయన వెల్లడించారు.

రాహుల్‌పై దాడి అప్రజాస్వామికం

ఎమ్మిగనూరుటౌన్: భారత్ న్యాయ జోడో యాత్రలో భాగంగా వెస్ట్‌బెంగాల్‌లో పర్యటిస్తున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై దాడి చేయడం అప్రజాస్వామికమని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీకి వస్తున్న ప్రజాధరణను ఓర్వలేకనే కొన్ని పార్టీలు అల్లరిమూకలను దించి భౌతిక దాడులకు పాల్పడడం శోచనీయమన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొని రాహుల్‌గాంధీకి తగిన భద్రత కల్పించాలని కోరారు.

ఆక్రమణల తొలగింపు

పత్తికొండ టౌన్: అధికారుల అనుమతి లేకుండా నిర్మించుకున్న కట్టడాలను ఆర్డీఓ నీలపు రామలక్ష్మి ఆదేశాల మేరకు పత్తికొండ తహసీల్దార్ విష్ణుప్రసాద్, రెవెన్యూ సిబ్బంది గురువారం తొలగించారు. మండలపరిధిలోని చిన్నహుల్తి రెవెన్యూ పరిధిలోని జగనన్న కాలనీల వద్ద, అలాగే కాశీరెడ్డి నాయన ఆశ్రమం ఎదురుగా జగనన్న లేఅవుట్ కాలనీల వద్ద అనుమతి లేకుండా నిర్మించుకున్న కట్టడాలను తహసీల్దార్ విష్ణుప్రసాద్ దగ్గరుండి ప్రొక్లెయినర్‌తో తొలగించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఆ కాలనీల్లో 130/2 సర్వే నంబర్, 616 సర్వే నంబర్‌లో కొందరు స్థలాలను ఆక్రమించుకుని ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి రావడంతో విచారణ చేసి, అక్రమ కట్టడాలను తొలగించినట్లు చెప్పారు.

నేడు ప్రారంభోత్సవం

మద్దికెర: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం-4, రైతు భరోసా కేంద్రం-4 కార్యాలయ భవనాలను శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధం చేసినట్లు జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో రూ.43.60 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం నిర్మించినట్లు చెప్పారు. అలాగే గ్రామంలో సొసైటీ వద్ద, సాయినగర్, చాకలి వీధులలో రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను, స్థానిక సహకార సంఘంలో జనరిక్ మందుల షాపును ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పందికోన గ్రామానికి చెందిన పాలేగార్ దివాకర్‌నాయుడు (57) గురువారం గుండెపోటుకు గురై మృతి చెందాడు. పని నిమిత్తం పత్తికొండకు వచ్చి తిరిగి వెళ్తుండగా స్థానిక అంబేడ్కర్ కూడలిలో గుండెపోటుతో అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందాడు. మృతుడికి భార్య శ్యామల, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఫుట్‌బాల్ విజేత హుబ్లీ జట్టు



కబడ్డీ విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం



హుబ్లీ ఫుట్‌బాల్ జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందజేస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: నీలకంఠేశ్వరస్వామి జాతర మహోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సహకారంతో స్థానిక ఎంఎస్ బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన వైఎస్సార్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో విజేతగా కర్ణాటక రాష్ట్రం హుబ్లీ జట్టు నిలిచింది. రెండవ స్థానంలో ఎమ్మిగనూరు జట్టు, మూడవ స్థానం గద్వాల జట్టు నిలిచాయి. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేత హుబ్లీ జట్టుకు రూ.1,00,116 నగదు బహుమతితో పాటు ట్రోఫీని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అందజేశారు. అలాగే ఎమ్మిగనూరు జట్టుకు ట్రోఫీ, రూ.50,116, గద్వాల జట్టుకు రూ.20,116లను అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రియాజ్‌అహమ్మద్, పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్, కౌన్సిలర్ కేశవరెడ్డి, ఆర్గనైజర్ విశ్వనాథ్‌రమేష్ తదితరులు ఎ

మహిళా కబడ్డీ విజేత తమిళనాడు జట్టు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎంఎస్ బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన వైఎస్సార్ అంతర్రాష్ట్ర మహిళా కబడ్డీ పోటీల్లో విజేతగా తమిళనాడు జట్టు నిలిచింది. ఆ జట్టుకు గురువారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ట్రోఫీతో పాటు రూ.50 వేలు నగదు బహుమతి అందజేశారు. రెండవ స్థానంలో నిలిచిన బెల్గాం జట్టుకు రూ.30 వేలు, మూడో స్థానం కైవసం చేసుకున్న ఢిల్లీ జట్టుకు రూ.20 వేలు, నాల్గవ స్థానంలో నిలిచిన హర్యానా జట్టుకు రూ రూ.10 వేల నగదు బహుమతులు ప్రదానం చేశారు. కౌన్సిలర్ పూజేశ్వరి, ఆర్గనైజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

మద్దికెర: మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, పరిపాలనాధికారి స్వర్ణలత కోరారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అధికారులు ఆయా శాఖల్లో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. జగనన్న కాలనీల్లో 742 ఇళ్లకు గాను ఇప్పటికే 399 నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగతావి పూర్తి దశలో ఉన్నాయన్నారు. రాబోయే వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టామని, శరవేగంగా ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాయంక్ తెలిపారు. ఏపీఎం మధు, ఏఓ రవి, తహసీల్దార్ నాగభూషణం ఆయా శాఖల ప్రగతిని వివరించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ.. వీఆర్‌ఏలు ఇళ్ల స్థలాలకు డబ్బు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పగా విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బదులిచ్చారు. వైస్ ఎంపీపీ మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు ఆంజనేయులు రామకృష్ణ, రేవమ్మ, జ్యోతిలత సర్పంచులు సుహాసిని, విజయుడు పాల్గొన్నారు.

తలుపు తట్టిన కానుక



సూదేపల్లెకు చెందిన బోడెల్ల మద్దమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ వినోద్



పక్షవాతంతో కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అల్లుగుండుకు చెందిన సాలమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ జ్యోతి

తుగ్గలి: పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఊరూరా గురువారం తెల్లవారుజామునే పండుగలా ప్రారంభమైంది. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి వేలిముద్రల నమోదు, ఫేస్ అథెంటికేషన్ ద్వారా పింఛన్ సొమ్మును అందజేశారు. మండలంలో 7,831 మంది పింఛన్‌దారులకు రూ.2,33,57,500 మంజూరైంది. తొలిరోజు 54.52 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు జూనియర్ అసిస్టెంట్ రాంబ్రహ్మం తెలిపారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలో ఫిబ్రవరి నెలకు సంబంధించి 8095 మంది లబ్ధిదారులకు రూ. 2,41,21,500 పింఛన్ సొమ్ము మంజూరైంది. 18 గ్రామ సచివాలయాల పరిధిలోని వలంటీర్లు తెల్లవారుజాము నుంచే ఒక్కొక్కరికి రూ.3 వేల ప్రకారం పింఛన్ల పంపిణీ చేపట్టారు. లబ్ధిదారులు ఎక్కడుంటే అక్కడికే వెళ్లి పింఛన్ సొమ్ము అందించడం విశేషం

ఆస్పరి: మండలంలోని 33 గ్రామాల్లో మొదటిరోజు 60 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఈఓఆర్డీ సూర్యనరసింహా రెడ్డి తెలిపారు. మొత్తం 7,363 మంది పింఛన్‌దారులకు గాను 4,300 మందికి పంపిణీ చేశామన్నారు. మిగతా వారికి కూడా అందజేసి వంద శాతం పంపిణీ పూర్తి చేస్తామన్నారు.

వేలం అక్రమాలపై విచారణ జరిపించాలి

పత్తికొండటౌన్: పందికోన గ్రామ రెవెన్యూ పరిధిలోని హంద్రీ-నీవా రిజర్వాయర్‌లో చేపల పెంపకం హక్కుల కోసం ఇటీవల నిర్వహించిన వేలంపాటలో అక్రమాలు జరిగాయని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిధులు స్వాహా కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పందికోన గ్రామస్తులు వేలంపాటను రద్దు చేయాలని కోరుతూ స్థానిక ఆర్డీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల ముందు ఆందోళన చేశారు. ఆర్డీఓ నీలపు రామలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. జనవరి 30న పందికోన గ్రామంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో వేలాలు నిర్వహించారన్నారు. గ్రామప్రజలకు సమాచారం ఇవ్వకుండా గుట్టుచప్పుడు కాకుండా కొందరి సమక్షంలో వేలం నిర్వహించినట్లు ఆరోపించారు. వేలంలో కాంట్రాక్టర్ రూ.40 లక్షలకు పాడగా అధికారికంగా రూ.3,13,100కు పాడినట్లు నమోదు చేశారని, దీనిపై సమగ్రంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ జరిపిస్తామని ఆర్డీఓ గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరురూరల్: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ సఫర్నీసాబేగం పేర్కొన్నారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. ప్రాజెక్టు పరిధిలోని 11 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారు పూర్తి చేసిన దరఖాస్తును ఈ నెల 7వ తేదీ సాయంత్రంలోపు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఖాళీలు వివరాలు

ఎమ్మిగనూరు: పట్టణంలోనీ తేరుబజార్ సెంటర్ నంబర్ – 32 (ఈఎస్‌డబ్ల్యూ), లింగాపురం రామయ్య కొట్టాల సెంటర్ నంబర్ – 52 (ఎస్టీ), కటికె వీధి సెంటర్ నంబర్– 69 (ఈఎస్‌డబ్ల్యూ), మండలంలోని ఎస్.నాగలాపురం సెంటర్ నంబర్ -1 (ఎస్టీ), టీఎస్ కూళ్లూరులో సెంటర్ నంబర్ -1 (ఓసీ), సెంటర్ నంబర్ -2 (ఎస్టీ) పోస్టులు ఖాళీగా ఉనాయని తెలిపారు.

నందవరం: మండలంలో హలహర్వి సెంటర్ నంబర్-2 (ఓసీ), నందవరం సెంటర్ నంబర్ -6 (బీసీ-ఏ), టి.సోమలగూడూరు సెంటర్ నంబర్ -3 (ఓసీ) ఖాళీలు ఉన్నాయని చెప్పారు.

→ గోనెగండ్ల మండలంలోని పుట్టపాశం సెంటర్ నంబర్ -1 (ఎస్టీ), హెచ్.కైరవాడి సెంటర్ నంబర్-1 (బీసీ-బీ)లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు.

ఆలూరు: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆలూరు, హొళగుంద, చిప్పగిరి మండలాల్లో ఖాళీగా 1 అంగన్‌వాడీ కార్యకర్త, 3 ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ మద్దమ్మ తెలిపారు. ఆలూరు మండలం ముద్దనగేరి అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త (బీసీ-ఏ), ఆయా పోస్టులు అరికెర (ఓసీ), చిప్పగిరి మండలం గుమ్మనూరు (ఓసీ), కుందనకుర్తిలో (ఓసీ) ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే హొళగుంద మండలం బీజీహళ్లిలో కార్యకర్త పోస్టు (బీసీ-ఈ), ఆయా పోస్టులు గజ్జెహళ్లిలో (బీసీ-డి), కోగిలతోటలో-2 కేంద్రంలో (ఎస్సీ), హెబ్బటం -2 కేంద్రంలో (ఎస్టీ), నెరణికి-2 కేంద్రంలో (ఈడబ్ల్యూఎస్) కేటగిరీలో ఖాళీలు ఉన్నాయని, అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కృష్ణగిరి: వెల్దుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో ఖాళీగా ఉన్న ఒక అంగన్‌వాడీ కార్యకర్త, నాలుగు ఆయా పోస్టులకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ ల్యూక్ గురువారం తెలిపారు. కృష్ణగిరి మండలంలో కటారుకొండ గ్రామం సెంటర్-1లో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు (ఓసీ), ఆయా పోస్టులు లక్కసాగరం (ఓసీ), సంగాల(బీసీ-ఏ) ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే వెల్దుర్తి మండలం సూదేపల్లె సెంటర్-2లో(ఎస్సీ), మల్లెపల్లె సెంటర్-2లో(ఓసీ) ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తులను వెల్దుర్తి సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

పత్తికొండటౌన్: ఐసీడీఎస్ పత్తికొండ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ సావిత్రిదేవి తెలిపారు.

ఖాళీల వివరాలు:

అంగన్‌వాడీ కార్యకర్త - బొందిమడుగుల-2 (ఓసీ), మినీ అంగన్‌వాడీ కార్యకర్త - బుగ్గతండా (ఎస్టీ)

ఆయా (6 పోస్టులు): పత్తికొండ-9 (ఈడబ్ల్యూఎస్), అటికెలగుండు-1 (ఓసీ), జొన్నగిరి తండా (ఓసీ), జొన్నగిరి-4 (ఎస్సీ), గుడిసె గుప్పెరాళ్ల -(బీసీ బీ), శభాష్‌పురం (ఓసీ) ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు.

దేవనకొండ: మండలంలో ఖాళీగా ఉన్న మాచాపురం (ఓసీ), వెంకటాపురం (ఓసీ) అంగన్‌వాడీ ఆయా పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ అధికారిణి కె.నిర్మలాదేవి సూచించారు.

బైక్‌లు ఢీకొని నలుగురికి గాయాలు



గాయపడిన దంపతులను అంబులెన్స్‌లో ఆదోనికి తరలిస్తున్న దృశ్యం

హొళగుంద: స్థానిక ఆదోని రోడ్డులోని ఈరన్న బావి సమీపంలో గురువారం మధ్యాహ్నం రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి రక్త గాయాలు కాగా వారిలో నూతన దంపతులు ఉన్నారు. వారం రోజుల క్రితం పెళ్లి చేసుకున్న హొళగుందకు చెందిన పింజరి రహిమాన్, ఫరీదా మొక్కు తీర్చుకునేందుకు ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి వెళ్లి తిరిగి హొళగుందకు బయలుదేరారు. వీరు వస్తున్న బైక్‌ను వందవాగిలి గ్రామానికి చెందిన ఉచ్చప్ప, షేక్ మహమ్మద్ బైక్‌పై హొళగుంద నుంచి వందవాగిలికి వెళ్తూ ఈరన్నబావి దాటిన తర్వాత వంక వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో దంపతులు రహిమాన్, ఫరీదాతో పాటు ఉచ్చప్ప, షేక్ మహ్మద్‌కు రక్త గాయాలు కాగా స్థానికులు వారిని హొళగుంద పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ డాక్టర్ బిందుమాధవి ప్రాథమిక చికిత్స అందించగా దంపతులు రహిమాన్, ఫరీదాకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో ఆదోనికి తరలించారు. హొళగుంద పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.